
సాక్షి
గుంటూరు

మంగళవారం । 24 । డిసెంబర్ । 2024



సాగునీటి సమాచారం

తాడేపల్లిరూరల్ (దుగ్గిరాల) : కృష్ణా పశ్చిమ ప్రధాన కాలువకు సీతానగరం వద్ద సోమవారం 1902 క్యూసెక్కులు విడుదల చేశారు. కొమ్మ మూరు కాలువకు 1410 క్యూసెక్కులు వదిలారు.



అమరేశ్వరుని సేవలో ఎస్పీ

అమరావతి: అమరావతిలోని బాలచాముండికా సమేత అమరేశ్వరుని సోమవారం ఎస్పీ కంది శ్రీనివాసరావు కుటుంబసభ్యులతో కలిసి దర్శించుకున్నారు.



సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జున సాగర్ జలాశయ నీటిమట్టం సోమవారం 576.30 అడుగుల వద్ద ఉంది. కుడి కాలువకు 8,298 క్యూసెక్కులు విడుదలవుతోంది.

న్యూస్‌రీల్

పెరిగిన సత్రశాల ఆదాయం



రెంటచింతల: మండలంలోని సత్రశాల వద్ద ఉన్న పురాతన గంగా భ్రమరాంబ సమేత మల్లికార్జున స్వామి దేవస్థానం ఆదాయం గత ఏడాది కన్నా పెరిగినట్టు దేవదాయ శాఖ సత్తెనపల్లి ఇన్‌స్పెక్టర్ వి.లీలావతి, దేవస్థానం ఈఓ గాదె రామిరెడ్డి తెలిపారు. సోమవారం సత్రశాల దేవస్థానంలో హుండీ లెక్కించగా రూ.4,42,500 వచ్చినట్లు వివరించారు. గత ఏడాది రూ.3,69,000 రాగా ప్రస్తుతం రూ.73,500 అధికంగా ఆదాయం వచ్చినట్లు వెల్లడించారు. స్థానిక శివాలయంలో కార్తీకమాసంలో హుండీ ఆదాయం రూ.11,388 వచ్చిందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమాలలో రెంటచింతల శివాలయం చైర్మన్ పల్లెర్ల లక్ష్మారెడ్డి, గుండా శివయ్య, మున్నా లింగయ్య, నీలం మల్లయ్య, అర్చకులు పాల్గొన్నారు.

సమగ్రశిక్షలో పోస్టుల భర్తీకి దరఖాస్తుల స్వీకరణ

గుంటూరు ఎడ్యుకేషన్: గుంటూరు జిల్లా సమగ్ర శిక్ష కార్యాలయంలో అసిస్టెంట్ స్టాటిస్టికల్ అధికారి పోస్టులో ఫారిన్ సర్వీసు నిబంధనలపై డెప్యూటేషన్‌పై పని చేసేందుకు ఆసక్తి, అర్హతలు గల ఉపాధ్యాయులు ఈనెల 31లోపు దరఖాస్తు చేయాలని జిల్లా విద్యాశాఖాధికారి సీవీ రేణుక సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని ప్రభుత్వ, జెడ్పీ, మున్సిపల్ ఉన్నత పాఠశాలల్లో స్కూల్ అసిస్టెంట్లుగా పని చేస్తున్న 55 ఏళ్లలోపు వయసు కలిగిన ఉపాధ్యాయులకు మాథ్స్, స్టాటిస్టిక్స్ సబ్జెక్టుల్లో పీజీతోపాటు గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి పీజీడీసీఏ, డీసీఏ డిప్లొమా ఉండాలని సూచించారు. విద్యార్హతల జిరాక్స్ కాపీలతో ఈనెల 31వ తేదీలోపు డీఈవో కార్యాలయంలోని సమగ్రశిక్ష విభాగంలో సమర్పించాలని, పూర్తి వివరాలకు సమగ్రశిక్ష గుంటూరు.బ్లాగ్‌స్పాట్.కామ్ సైట్‌ను సంప్రదించాలని తెలిపారు.

యార్డుకు 65,687 బస్తాల మిర్చి



కొరిటిపాడు(గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డుకు సోమవారం 65,687 మిర్చి బస్తాలు రాగా, గత నిల్వలతో కలిపి ఈ–నామ్ విధానం ద్వారా 60,866 బస్తాల అమ్మకాలు జరిగాయి. నాన్ ఏసీ కామన్ రకం 334, నంబర్–5, 273, 341, 4884, సూపర్–10 రకాల మిర్చి సగటు ధర రూ.7,500 నుంచి రూ.14,800 వరకు పలికింది. నాన్ ఏసీ ప్రత్యేక రకం తేజ, బాడిగ, దేవనూరు డీలక్స్ రకాల మిర్చి సగటు ధర రూ.8,000 నుంచి 16,000 వరకు లభించింది. అమ్మకాలు ముగిసే సమయానికి యార్డులో ఇంకా 49,236 బస్తాల మిర్చి నిల్వ ఉన్నట్లు యార్డు ఉన్నతశ్రేణి కార్యదర్శి వి.ఆంజనేయులు తెలిపారు.

నేడు మున్సిపల్ టీచర్స్ ఉద్యోగోన్నతుల కౌన్సెలింగ్

గుంటూరు ఎడ్యుకేషన్: ఉమ్మడి గుంటూరు జిల్లాలోని నగరపాలక సంస్థ, పురపాలక పాఠశాలల్లో పని చేస్తున్న ఎస్జీటీలకు స్కూల్ అసిస్టెంట్లుగా ఉద్యోగోన్నతి కల్పించేందుకు మంగళవారం ఉదయం 11 గంటలకు కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నట్లు జిల్లా విద్యాశాఖాధికారి సీవీ రేణుక సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. డీఈవోజీఎన్‌టీ.బ్లాగ్‌స్పాట్.కామ్ వెబ్‌సైట్‌లో ఉంచిన సీనియార్టీ జాబితాలో పొందుపర్చిన ఉపాధ్యాయులు ఒరిజినల్ సర్టిఫికెట్లు, సర్వీస్ రిజిస్టర్‌తో జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయంలో హాజరు కావాలని సూచించారు.

ఉద్యోగాల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానం

గుంటూరు మెడికల్: జిల్లాలో నేషనల్ హెల్త్ మిషన్, జాతీయ టీబీ నిర్మూలన కార్యక్రమంలో కాంట్రాక్టు పోస్టుల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు డీఎంహెచ్ఓ డాక్టర్ కొర్రా విజయలక్ష్మి తెలిపారు. డాట్ ప్లస్ టీబీ హెచ్ఐవీ సూపర్‌వైజర్ పోస్టు ఒకటి, టీబీ సెంటర్ స్టాటిస్టికల్ అసిస్టెంట్ పోస్టు ఒకటి, అకౌంటెంట్ పోస్టు ఒకటి, టీబీ హెచ్‌డీ ఎస్‌జీఓ పోస్టులు మూడు, డిస్ట్రిక్ ప్రోగ్రామ్ పోస్టు ఒకటి ఖాళీగా ఉన్నాయని పేర్కొన్నారు. ఉద్యోగాల భర్తీ నోటిఫికేషన్ దరఖాస్తు ఫారం, జీతాలు, ఇతర వివరాలకు గుంటూరు.ఏపీ.జీఓవీ.ఇన్ వెబ్‌సైట్‌లో చూడాలన్నారు. దరఖాస్తులను ఈనెల 24 నుంచి జనవరి 5 వరకు డీఎంహెచ్ఓ కార్యాలయంలో అందజేయాలన్నారు. పూర్తి వివరాలకు జిల్లా టీబీ అధికారిణిని 778058 2555 నంబరులో సంప్రదించాలన్నారు.



మెరిసే క్రిస్మస్

క్రిస్మస్ కాంతులతో గుంటూరు నగరం మెరిసిపోతోంది. పండగ సందడితో కళకళలాడుతోంది. పలు చర్చిలు, క్రైస్తవుల ఇళ్లు విద్యుద్దీప శోభతో ధగధగలాడుతున్నాయి. సెమీ క్రిస్మస్ ఆరాధనలతో పులకిస్తున్నాయి. భక్తిపారవశ్యం ఉప్పొంగుతోంది. ప్రత్యేక అలంకరణతో తళుకులీనుతున్న నార్త్ ప్యారిస్ చర్చి, లూథరన్ చర్చిలను చిత్రాల్లో చూడొచ్చు. – సాక్షి ఫొటోగ్రాఫర్, గుంటూరు



ప్రజల పక్షాన పోరుబాట

- విద్యుత్‌చార్జీల పెంపుపై ఆందోళన
- 27న విద్యుత్ కార్యాలయాల ఎదుట నిరసన
- పోస్టర్‌ను ఆవిష్కరించిన వైఎస్సార్ సీపీ నేతలు
- ప్రజలపై రూ.15,484 కోట్లు భారం మోపిన కూటమి సర్కారు
- ధ్వజమెత్తిన వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు అంబటి రాంబాబు



పోరుబాట పోస్టర్ ఆవిష్కరిస్తున్న మాజీ మంత్రి అంబటి రాంబాబు, పార్టీ నేత మోదుగుల వేణుగోపాలరెడ్డి తదితరులు

పట్నంబజారు(గుంటూరు ఈస్ట్): రాష్ట్ర ప్రజలపై విద్యుత్ చార్జీల భారాన్ని మోపుతున్న కూటమి ప్రభుత్వంపై వైఎస్సార్ సీపీ పోరుబావుటా ఎగరేసింది. ఈ నెల 27న జిల్లా వ్యాప్తంగా విద్యుత్ కార్యాలయాల వద్ద నిరసన కార్యక్రమాలకు పిలుపునిచ్చింది. బృందావన్ గార్డెన్స్‌లోని పార్టీ జిల్లా కార్యాలయంలో నిరసనకు సంబంధించిన పోస్టర్‌లను పార్టీ నేతలు సోమవారం ఆవిష్కరించారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు అంబటి రాంబాబు, గుంటూరు, పల్నాడు జిల్లాల పార్లమెంట్ జిల్లాల పరిశీలకులు మోదుగుల వేణుగోపాల్‌రెడ్డి, నగర మేయర్ కావటి మనోహర్ నాయుడు, డెప్యూటీ మేయర్, నగర అధ్యక్షుడు, తాడికొండ నియోజకవర్గ సమన్వయకర్త వనమా బాలవజ్రబాబు (డైమండ్), పొన్నూరు నియోజకవర్గ సమన్వయకర్త అంబటి మురళీకృష్ణ, తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త షేక్ నూరిఫాతిమా, మంగళగిరి నియోజకవర్గ సమన్వయకర్త దొంతిరెడ్డి వేమారెడ్డి, పార్టీ ముఖ్య నేతలు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా పార్టీ జిల్లా అధ్యక్షుడు అంబటి రాంబాబు మాట్లాడుతూ ఏరుదాటాక తెప్ప తగలేసే చందంగా చంద్రబాబు ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను విస్మరించటం కొత్తేమీ కాదని ఎద్దేవా చేశారు. ఎన్నికల ముందు విద్యుత్ చార్జీలను తగ్గిస్తామని బాబు చెప్పారని, అసలు పెంచబోమని కూడా చెప్పిన మాట వాస్తవం కాదా అని ప్రశ్నించారు. ఎన్నికలు అయిపోయిన తరువాత రాష్ట్ర ప్రజలపై పెనుభారాన్ని మోపుతున్నారని ధ్వజమెత్తారు. విద్యుత్ బిల్లులతో ప్రజలపై బాదుడు కార్యక్రమం ప్రారంభించారని మండిపడ్డారు. నవంబర్ నెలలో రూ.6,072 కోట్లు, డిసెంబర్ నెలలో రూ.9,412 కోట్లు కలిపి మొత్తం రూ.15,484 కోట్ల భారాన్ని ప్రజలపై మోపారని విమర్శించారు. అందుకే ప్రజల పక్షాన వైఎస్సార్ సీపీ చేపడుతున్న పోరుబాట నిరసన కార్యక్రమానికి వినియోగదారులు పెద్ద ఎత్తున తరలి రావాలని పిలుపునిచ్చారు. జిల్లా వ్యాప్తంగా అన్ని నియోజకవర్గాల్లో నిరసన తెలియజేయటంతోపాటు, అధికారులకు వినతిపత్రాలు అందించనున్నట్టు వెల్లడించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నేతలు నిమ్మకాయల రాజనారాయణ, మాదిరెడ్డి శ్రీనివాసరెడ్డి, బైరెడ్డి రవీంద్రారెడ్డి, కార్పొరేటర్‌లు ఈచంపాటి వెంకటకృష్ణ (ఆచారి), రోషన్ పార్టీ నేతలు, అనుబంధ విభాగాల నేతలు తదితరులు పాల్గొన్నారు.

అర్జీలు పెండింగ్ ఉండొద్దు

- అధికారులకు కలెక్టర్ నాగలక్ష్మి ఆదేశం
- గ్రీవెన్స్‌లో అర్జీల స్వీకరణ



గ్రీవెన్స్‌లో అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ నాగలక్ష్మి, జేసీ భార్గవ్ తేజ అధికారులు

గుంటూరు వెస్ట్: ప్రజల నుంచి వచ్చే అర్జీలను పెండింగ్ ఉంచొద్దని, వాటిని వేగంగా పరిష్కరించాలని కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని ఎస్ఆర్ శంకరన్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి శాఖలోనూ పెండింగ్ అర్జీ ఉండకూడదన్నారు. పరిష్కారానికి వీలుకాని వాటిని అర్జీదారుడికి అర్థమయ్యేలా వివరించాలన్నారు. తమ అర్జీలను ప్రజలు స్థానికంగా ఉండే మండల, డివిజనల్, మున్సిపల్ స్థాయి అధికారులకు ప్రతి వారం ఇవ్వొచ్చన్నారు. దీంతో స్థానికంగా ఉండే ప్రజల సమస్యలు అక్కడికక్కడే పరిష్కారమవుతాయన్నారు. ప్రజలు అందించే అర్జీలకు తప్పనిసరిగా ఎండార్స్‌మెంట్ ఇవ్వాలన్నారు. సమస్యల పరిష్కారంలో నిర్లిప్తత ఉండకూడదని తెలిపారు. బియాండ్ ఎస్ఎల్ఏలోకి అర్జీలు వెళితే సంబంధిత అధికారికి మెమో జారీ చేయాలన్నారు. అనంతరం వచ్చిన 155 అర్జీలను కలెక్టర్, జాయింట్ కలెక్టర్ ఎ.భార్గవ్ తేజ, డీఆర్వో ఖాజావలి, ఆర్డీఓ కె.శ్రీనివాసరావు, పీజీఆర్ఎస్ నోడల్ అధికారి ఎం.గంగరాజు, స్పెషల్ డెప్యూటీ కలెక్టర్, లక్ష్మీ కుమారి, జిల్లా అధికారులు పరిశీలించారు.

బాధ్యత ముఖ్యం

ప్రభుత్వ ఉద్యోగమంటే కేవలం ఉపాధి మాత్రమే కాదని, అంతకు మించిన బాధ్యతగా గుర్తించాలని కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి పేర్కొన్నారు. సోమవారం కలెక్టరేట్‌లోని ఎస్ఆర్ శంకరన్ సమావేశ మందిరంలో ముగ్గురికి కారుణ్య నియామక ఉత్తర్వులు అందజేశారు. బాధ్యతగా పనిచేయాలని సూచించారు.

బ్యాటరీ వాహనం ఇప్పించండి

నేను దివ్యాంగుడిని. ఎలక్ట్రీషియన్‌గా జీవనం సాగిస్తున్నా. నాకు ఇటీవల కుడి భుజంలో ఇబ్బందులు ఏర్పడ్డాయి. ట్రై సైకిల్‌ను చేతితో తోయలేకపోతున్నా. బ్యాటరీ ట్రై సైకిల్ ఇప్పించండి.

– ఎం.గణేష్, నల్లచెరువు

మూడు నెలలైనా పట్టించుకోరా

వరదల వల్ల నష్టపోయిన సుమారు 200 కుటుంబాలు నష్టపరిహారం కోసం మూడు నెలల నుంచి తిరుగుతున్నాం. సిబ్బంది చాలా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. న్యాయం చేయండి.


– కె.జయసుధ, విముక్త చిరుతల పార్టీ రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు

మెటీరియల్ 'టెన్'షన్!

- పదో తరగతి విద్యార్థులకు ఇంకా అందని స్టడీ మెటీరియల్
- డిసెంబర్ ముగుస్తున్నా చలనం లేని పాలకులు, అధికారులు
- 2022లో రాష్ట్రంలోనే తొలిసారిగా జగనన్న విద్యాజ్యోతి స్టడీ మెటీరియల్ పంపిణీ
- ఈసారీ నవంబర్ 2న జెడ్పీకి మెటీరియల్ అందజేసిన విద్యాశాఖ
- టెండర్ల ఖరారు, ముద్రణలో జెడ్పీ పాలకుల తీవ్ర నిర్లక్ష్యం

గత రెండేళ్లు మెటీరియల్ పంపిణీ ఇలా..

సంవత్సరం	అందుకున్న విద్యార్థులు	ఖర్చుచేసిన మొత్తం(రూ.లక్షల్లో)
2022	36,155	61.80
2023	39,000	70.00



జగనన్న విద్యాజ్యోతి స్టడీ మెటీరియల్ (ఫైల్)

గుంటూరు ఎడ్యుకేషన్: ప్రభుత్వ పాఠశాలల్లో పదో తరగతి చదువుతున్న విద్యార్థులకు సకాలంలో స్టడీ మెటీరియల్ అందించడంలో జెడ్పీ పాలకవర్గం, అధికార యంత్రాంగం విఫలమైంది. ఉమ్మడి గుంటూరు జిల్లాలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో పని చేస్తున్న సీనియర్ ఉపాధ్యాయులతో అధిక మార్కుల సాధనకు దోహదం చేసేలా రూపొందించిన మెటీరియల్‌ను విద్యాశాఖాధికారులు గత నవంబర్ 2న జెడ్పీ పాలకవర్గానికి అందజేసినా, ఇప్పటికీ కనీసం ముద్రణకు నోచుకోలేని దుస్థితి నెలకొంది. స్టడీ మెటీరియల్ పంపిణీలో నెలకొన్న జాప్యంపై ఇటు పాలకవర్గం, అటు అధికారులు ఒకరిపై ఒకరు ఆరోపణలు చేసుకుంటున్నారు.

వైఎస్ జగన్ పాలనలో రెండేళ్లపాటు నిరాటంకంగా..

విద్యారంగంలో విప్లవాత్మక మార్పులను తీసుకువచ్చిన వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో వరుసగా రెండేళ్లు 'జగనన్న విద్యాజ్యోతి' పేరుతో స్టడీ మెటీరియల్ రూపొందించి సకాలంలో పదో తరగతి విద్యార్థులకు పంపిణీ చేసిన జెడ్పీ పాలకవర్గం కూటమి ప్రభుత్వ పాలనలో తొలి ఏడాదే చతికిలబడింది. 2022 నవంబరులో రూ.61.80 లక్షల జెడ్పీ నిధులతో రాష్ట్రంలోనే తొలిసారిగా ఉమ్మడి గుంటూరు జిల్లా వ్యాప్తంగా 36,155 మందికి స్టడీ మెటీరియల్ అందించారు. 2023లోనూ రూ.70 లక్షలతో 39వేల మందికి మెటీరియల్ ఇచ్చారు. ప్రస్తుతం టెన్త్ పరీక్షలకు సిద్ధమవుతున్న 35వేల మందికి రూ.70 లక్షలతో మెటీరియల్ పంపిణీకి గత జెడ్పీ సర్వసభ్య సమావేశంలోనే నిర్ణయించినా ఆచరణలోకి రాలేదు. మార్చి 17 నుంచి టెన్త్ పరీక్షలు జరుగుతాయి. విద్యాశాఖ మెటీరియల్‌ను నవంబర్ 2న జెడ్పీకి అందించినా ముద్రణ చేయించడంలో జెడ్పీ పాలకవర్గం, అధికార యంత్రాంగం విఫలమయ్యాయి.

విద్యార్థులు నష్టపోతున్నారు

టెన్త్ విద్యార్థులకు డిసెంబర్ 15లోపు స్టడీ మెటీరియల్ ఇస్తామని హామీ ఇచ్చిన జెడ్పీ పాలకవర్గం, అధికారులు ఆచరణలో విఫలమయ్యారు. జనవరిలో ఇచ్చినా, స్టడీ మెటీరియల్ ఆధారంగా పరీక్షలకు సన్నద్ధం కావడం విద్యార్థులకు సాధ్యపడదు. వెంటనే ఇచ్చే ఏర్పాట్లుచేయాలి.

– కేఎస్ లక్ష్మణరావు, గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ

ఆరోగ్యంపై కేకుదెబ్బ

- అనారోగ్యాన్ని కొనితెచ్చుకోవద్దు
- కేక్ కొనేముందు గమనించాలి
- స్వీట్లనూ పరిశీలించి తీసుకోవాలి
- అనుమతి లేకుండా వ్యాపారం చేస్తే జైలుకే
- అసిస్టెంట్ ఫుడ్ కంట్రోలర్ నూతలపాటి పూర్ణచంద్రరావు





రంగులతో చేసిన స్వీట్లు , కేకులు

నాణ్యత లేకుంటే ఫిర్యాదు చేయండి 94403 79755

గుంటూరు మెడికల్: పండుగ, పుట్టినరోజు, పెళ్లి రోజు, వార్షికోత్సవం ఇలా సందర్భం ఏదైనా కేక్ కట్‌చేయటం ఇప్పుడు ఆనవాయితీగా మారింది. ప్రతి శుభ కార్యానికీ స్వీట్ బాక్స్ తీసుకెళ్ళడాన్ని గమనిస్తూనే ఉన్నాం. జిల్లాలోని అనేక ప్రాంతాల్లో స్వీట్లు, కేక్‌లు తయారు చేసే షాపులు ఉన్నాయి. వీటిల్లో నిత్యం లక్షలాది రూపాయల్లో వ్యాపారం జరుగుతోంది. కొన్ని రకాల బ్రాండ్‌ల పేరుతో ఉన్న షాపుల్లో గుంటూరు నగరం నుంచి దేశవిదేశాలకు స్వీట్లు ఎగుమతి అవుతున్నాయి. అయితే కేక్‌లు, స్వీట్లు కొనుగోలు చేసే సమయంలో ఒకింత జాగ్రత్త వహించి, పదార్థాలను పరిశీలించాలి. లేకపోతే ఆనందంగా తినే ఆహార పదార్థాలే విషంగా మారతాయి. అనారోగ్యాన్ని బహుమతిగా ఇస్తాయి.

క్రిస్మస్ నుంచి సంక్రాంతి వరకు అమ్మకాలు

డిసెంబర్ ప్రారంభం నుంచి ప్రతిచోటా సెమీ క్రిస్మస్‌లు జరుగుతూనే ఉంటాయి. రోజూ కేక్ కటింగ్‌లు ఉంటాయి. డిసెంబర్ 25 క్రిస్మస్ రోజున, జనవరి 1 నూతన సంవత్సరం రోజున, సంక్రాంతి రోజున స్వీట్లు, కేక్‌ల అమ్మకాలు భారీగా ఉంటాయి. ఏడాది మొత్తంలో జరిగే అమ్మకాల్లో వచ్చే లాభాల కంటే కేవలం క్రిస్మస్, జనవరి ఫస్ట్ రోజున వచ్చే ఆదాయమే అనేక రెట్లు ఎక్కువగా ఉంటుంది. కులమతాలకు అతీతంగా ప్రతి ఒక్కరూ ఈ రోజుల్లో కేక్‌లు కట్‌చేసి, స్వీట్లు పంచుకుని సంబరాలు చేసుకుంటారు. రోడ్లపైన బల్లలు పెట్టి, పందిళ్లు వేసి ఒక్కరోజులోనే లక్షలాది రూపాయల వ్యాపారం చేస్తారు. అయితే వ్యాపారుల్లో చాలా మంది స్వలాభం కోసం వినియోగదారుల ఆరోగ్యం గురించి ఏ మాత్రం పట్టించుకోకుండా ప్రభుత్వం నిషేధించిన రంగులను కేక్‌లు, స్వీట్ల తయారీలో వినియోగిస్తున్నారు.

నిబంధనలు పాటించరు

జిల్లాలో బేకరీ షాపుల నిర్వాహకులు, స్వీట్లు షాపుల నిర్వాహకులు ఎక్కువ మంది ఫుడ్ లైసెన్స్‌లు తీసుకోకుండా అమ్మకాలు చేస్తున్నారు. రొట్టె, కేక్, స్వీట్ల కవర్లు, బాక్సులపై వాటి తయారీ తేదీ, గడువు తీరే తేదీ కచ్చితంగా ముద్రించాలి. లేకుంటే చట్టరీత్యా నేరమే. స్వీట్లు, కేక్‌లు కొనుగోలు చేసే సమయంలో వినియోగదారులు నాణ్యతా ప్రమాణాలు తప్పనిసరిగా చూడాలి. చాలామంది కేక్‌లు, స్వీట్ల తయారీలో అనుమతి లేని రంగులను వాడుతున్నారని, కేక్‌లపై పేర్లు రాసేందుకు వీటిని ఉపయోగిస్తున్నారని ఫుడ్ ఇన్‌స్పెక్టర్లు హెచ్చరిస్తున్నారు.


రోగాలొస్తాయి



నిషేధించిన రంగులతో తయారు చేసిన కేక్‌లు, స్వీట్లు తినటం వల్ల అనేక రోగాలు వస్తాయి. పలు రకాల క్యాన్సర్లకు, ఊపిరితిత్తుల సమస్యలకు, జీర్ణకోశ వ్యాధులకు దారితీస్తాయి. ఒక్కోసారి ఫుడ్ పాయిజన్ జరిగి వాంతులు, విరేచనాలవుతాయి. ప్రాణాపాయ స్థితినీ తీసుకొస్తాయి. తస్మాత్ జాగ్రత్త.

– డాక్టర్ అంది కోటి వెంకటేశ్వరరావు, సర్జికల్ గ్యాస్ట్రోఎంట్రాలజిస్ట్, గుంటూరు.

రూ. 5 లక్షల వరకు జరిమానా...



అనుమతి లేకుండా కేక్‌లు, స్వీట్లు రోడ్లపై విక్రయాలు చేసేవారిపై దాడులు చేసి, విక్రయించే ఆహార పదార్థాలను సీజ్ చేసి, వారిపై క్రిమినల్ చర్యలు తీసుకుంటాం. ఆహార పదార్థాలను తయారుచేసే సంస్థల వారు, హోల్‌సేల్‌గా, రిటైల్‌గా అమ్మేవారు అందరూ తప్పనిసరిగా ఆహార పదార్థాల క్రయవిక్రయాల లైసెన్స్‌ను అసిస్టెంట్ ఫుడ్ కంట్రోలర్ కార్యాలయంలో తీసుకోవాలి. వ్యాపారులు లైసెన్స్ లేకుండా అమ్మకాలు చేస్తే రూ.ఐదు లక్షల జరిమానా, ఆరునెలల జైలు శిక్ష ఉంటుంది. ఈ ఏడాది ఇప్పటికే ఆరుగురు బేకరీ వ్యాపారులపై కేసులు నమోదు చేశాం.

– నూతలపాటి పూర్ణచంద్రరావు, అసిస్టెంట్ ఫుడ్ కంట్రోలర్, గుంటూరు

వజ్రబాబు సోదరికి న్యాయం చేయాలి

ఎస్పీని కలిసి వినతిపత్రం అందించిన వైఎస్సార్ సీపీ నేతలు



గుంటూరు జిల్లా ఎస్పీతో మాట్లాడుతున్న అంబటి రాంబాబు, ఎమ్మెల్సీ లేళ్ళ అప్పిరెడ్డి, అంబటి మురళీకృష్ణ, మోదుగుల, వేణుగోపాలరెడ్డి, వనమా బాలవజ్రబాబు, నూరిఫాతిమా

నగరంపాలెం(గుంటూరు వెస్ట్): వైఎస్సార్ సీపీ తాడికొండ నియోజకవర్గ సమన్వయకర్త, జీఎంసీ డెప్యూటీ మేయర్ బాలవజ్రబాబు (డైమండ్ బాబు) సోదరికి న్యాయం చేయాలని, ఆమె ఇంటి నుంచి బయట పాడేసిన సామాన్లను తిరిగి ఇంటిలో చేర్చేందుకు చర్యలు తీసుకోవాలని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి అంబటి రాంబాబు కోరారు. ఆదివారం గుంటూరు విద్యానగర్‌లోని డైమండ్‌బాబు సోదరి ఇంటి విషయమై తలెత్తిన వివాదంపై సోమవారం రాత్రి ఎస్పీ సతీష్ కుమార్‌ను జిల్లా పోలీస్ కార్యాలయంలో కలిసి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి అంబటి రాంబాబు మీడియాతో మాట్లాడుతూ ఆదివారం జరిగిన వివాదం పూర్తిగా సివిల్ వివాదమని పేర్కొన్నారు. వజ్రబాబు సోదరి, వారి కుటుంబ సభ్యులు చాన్నాళ్లుగా ఆ ఇంట్లో నివసిస్తున్నారని చెప్పారు. ఓనర్‌షిప్ విషయమై న్యాయస్థానంలో కొంత కాలంగా వివాదం నడుస్తోందని వివరించారు. ఆదివారం రాత్రి హఠాత్తుగా కిరణ్ అనే వ్యక్తి, పలువురితో కలిసి వచ్చి డైమండ్‌బాబు సోదరిని, ఇంట్లోని సామాన్లను రోడ్డుపై విసిరేసి, ఇంటిని ఆక్రమించుకున్నారని విమర్శించారు. ఈ క్రమంలో డైమండ్ బాబు వెళ్తే పోలీసులు అరెస్ట్ చేశారని, ఆయన సెల్‌ఫోన్ లాగేసుకుని, 41 నోటీసులు ఇచ్చారని పేర్కొన్నారు. కిరణ్ అనే వ్యక్తి డైమండ్‌బాబుపై, వారి కుటుంబ సభ్యులపై కుట్రపూరితంగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. అయితే సివిల్ వివాదాల్లో పోలీసుల జోక్యం ఉండరాదనే విషయమై ఎస్పీ దృష్టికి తీసుకెళ్లామని చెప్పారు. వజ్రబాబు సోదరిని, సామాన్లను ఇంట్లోకి తీసుకెళ్లడంపై చర్చించామని వివరించారు. ఎస్పీ సానుకూలంగా స్పందించారని, సామాన్లను లోనికి తరలించే విషయమై పరిశీలించి చర్యలు తీసుకుంటామని చెప్పారని అంబటి వివరించారు. గుంటూరు, పల్నాడు జిల్లాల పార్లమెంటు పరిశీలకులు, మాజీ ఎంపీ మోదుగుల వేణుగోపాలరెడ్డి, ఎమ్మెల్సీ లేళ్ళ అప్పిరెడ్డి, మేయర్ కావటి మనోహర్, వైఎస్సార్ సీపీ తూర్పు సమన్వయకర్త షేక్ నూరిఫాతిమా, పొన్నూరు సమన్వయకర్త అంబటి మురళీకృష్ణ, పార్టీ రాష్ట్ర కార్యదర్శి నిమ్మకాయల రాజనారాయణ, బాలవజ్రబాబు పాల్గొన్నారు.

వాణిజ్యం
నిమ్మకాయల ధరలు

గుంటూరు జిల్లా తెనాలి మార్కెట్‌యార్డులో సోమవారం నిమ్మకాయల క్వింటా ధర

కనిష్ఠం : రూ. 3,200 గరిష్ఠం : రూ. 4,000

మోడల్ ధర రూ. 3,600

క్లుప్తంగా

జాతీయ రహదారిపై లారీ దగ్ధం



గుంటూరు రూరల్: జాతీయరహదారిపై వెళుతున్న లారీ ఒక్కసారిగా ఇంజిన్‌లో మంటలు రేగి దగ్ధమైన సంఘటన నల్లపాడు పోలీస్ స్టేషన్ పరిధిలో సోమవారం చోటు చేసుకుంది. సీఐ వంశీధర్ తెలిపిన వివరాల ప్రకారం పేరేచర్ల నుంచి ఆటోనగర్‌లోని లారీ షోరూంకు వెళుతున్న టిప్పర్‌లారీ ఒక్కసారిగా మంటలు రేగటంతో డ్రైవర్ అప్రమత్తమై లారీనుంచి దిగిపోయాడు. వెంటనే ఫైర్ సిబ్బందికి పోలీసులు సమాచారం అందించటంతో సిబ్బంది సంఘటనా స్థలికి చేరుకుని మంటలను అదుపు చేశారు. దీంతో ట్రాఫిక్ రెండుగంటలపాటు నిలిచిపోయింది. సంఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని నల్లపాడు పోలీసులు తెలిపారు.

నూతన వ్యవసాయ మార్కెటింగ్ విధానాన్ని వెనక్కి తీసుకోవాలి

నరసరావుపేట: కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన కొత్త జాతీయ వ్యవసాయ మార్కెట్ విధానాన్ని వెంటనే వెనక్కి తీసుకోవాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం(ఏపీకేఎస్) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేవీవీ ప్రసాద్ కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. జాతీయ మార్కెటింగ్ విధానాన్ని వ్యతిరేకిస్తూ అఖిలపక్ష రైతు సంఘాల ఆధ్వర్యంలో సోమవారం స్టేషన్‌రోడ్డులోని గాంధీ పార్క్ ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం జీఓ కాపీలు దహనం చేశారు. ఏపీకేఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఏపూరి గోపాలరావు అధ్యక్షతన నిర్వహించిన నిరసన కార్యక్రమంలో ప్రసాద్ మాట్లాడుతూ 13 నెలలు పోరాటంతో కేంద్ర ప్రభుత్వం దిగివచ్చి రైతు వ్యతిరేక వ్యవసాయ చట్టాలు ఉపసంహరించుకుంటున్నామని చెప్పిన వారు, నేడు దొడ్డిదారిన జాతీయ వ్యవసాయ మార్కెట్ విధానం పేరుతో వ్యవసాయం మొత్తాన్ని కార్పొరేట్లకు అప్పజెప్పే ప్రయత్నం చేయడం రైతులను వంచించటమేనని విమర్శించారు. కౌలు రైతు సంఘ రాష్ట్ర అధ్యక్షులు వై.రాధాకృష్ణ మాట్లాడారు. ఆల్ ఇండియా కిసాన్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షులు రెడ్ బాషా, పీడీఎం రాష్ట్ర నాయకుడు వై.వెంకటేశ్వరరావు, రైతు సంఘం ప్రధాన కార్యదర్శి ఉలవపూడి రాము పాల్గొన్నారు.

కలెక్టర్‌కు వినతిపత్రం..

ఈ మేరకు గత 26 రోజులుగా నిరాహార దీక్ష చేస్తున్న రైతు నాయకుడు దల్లేవాలా ప్రాణాలు కాపాడాలని, ఢిల్లీకి పాదయాత్ర చేస్తున్న రైతులపై అణచివేతను ఆపాలని, రైతులందరినీ లక్సర్ జైలు నుంచి తక్షణమే విడుదల చేయాలని, కేరళ తరహాలో రుణమాఫీ చట్టాన్ని అమలు చేయాలని కోరుతూ జిల్లా కలెక్టర్ అరుణ్ బాబుకు వినతిపత్రం అందజేశారు.

పొలం ఆక్రమించి ప్లాట్లుగా వేశారు

- ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో బాధితుడి మొర
- జిల్లా పోలీసు కార్యాలయానికి వెల్లువెత్తిన ఫిర్యాదులు
- సమస్యలు ఆలకించిన జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్



సమస్యలు ఆలకిస్తున్న జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్

నగరంపాలెం: పొలం ఆక్రమించుకుని బెదిరింపులకు పాల్పడుతున్నారని వ్యక్తి, కుమార్తె మృతిపై అనుమానాలు ఉన్నాయని ఓ తల్లి, ఉద్యోగాల పేర్లతో మోసగించారంటూ బాధితులు జిల్లా ఎస్పీ ఎదుట వాపోయారు. సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయ (డీపీఓ) ఆవరణలో ప్రజా ఫిర్యాదులు పరిష్కార వేదిక నిర్వహించారు. జిల్లా ఎస్పీ సతీష్ కుమార్ బాధితుల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. వారి మొరను అలకించారు. బాధితులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను సాధ్యమైనంత త్వరగా పరిష్కరించాలని సూచించారు. జిల్లా ఏఎస్పీలు జీవీ.రమణమూర్తి (పరిపాలన), ఎ.హనుమంతు (ఏఆర్), డీఎస్పీలు సుబ్బారావు, మురళీకృష్ణ కూడా అర్జీలు స్వీకరించారు.

కుమార్తె మృతిపై అనుమానాలు

గతేడాది డిసెంబర్‌లో ఇంట్లో మా కుమార్తె మృతి చెందింది. అయితే కుమార్తెను తెలిసిన వారే చంపేశారు. గతంలో ఆమె చదువుకునే క్రమంలో ఇద్దరు వెంటపడి ప్రేమించాలని ఒత్తిడి తీసుకువచ్చేవారు. మా కుమార్తె మృతిపై అనుమానాలు ఉన్నాయి. గతంలో స్థానిక పోలీసులు, జిల్లా పోలీస్ కార్యాలయంలో ఫిర్యాదు చేసినా ప్రయోజనంలేదు. ప్రస్తుతం వారి ఇద్దరికి భయపడి శ్రీనివాసరావుపేట అరవై అడుగుల అడ్డరోడ్డులో అద్దెకు ఉంటున్నాం. న్యాయం చేయగలరు.

– ఎం.శ్రీదేవీ, శ్రీనివాసరావుపేట.

పొలాన్ని ఆక్రమించారు..

సుమారు 14 ఏళ్ల క్రితం ప్రత్తిపాడు గింజువారిపాలెం గ్రామ వాసి వద్ద 4.25 సెంట్ల పొలం కొనుగోలు చేశా. కుటుంబ సమస్యల దృష్ట్యా పొలం వద్దకు వెళ్లలేదు. ఈలోగా పొలాన్ని ఆక్రమించి ప్లాట్‌లుగా విక్రయిస్తున్నారని తెలిసి స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేశాను. సివిల్ వివాదమని పోలీసులు చెప్పగా జిల్లా కోర్టులో దావా వేశా. విచారణ తదుపరి డిక్రీ పొందాను. కొంతకాలానికి పొలం వద్దకెళ్లగా తెలిసిన వ్యక్తులు ఇబ్బందులకు గురిచేశారు. రక్షణ కల్పించాల్సిన పోలీసులు అవతలి వ్యక్తులకు వత్తాసు పలుకు తున్నారు.

– కె.వెంకటేశ్వర్లు, హనుమాన్‌నగర్, గుంటూరు.

దుబాయ్ పంపిస్తానని..

తెలిసిన వ్యక్తి దుబాయ్ పంపిస్తానని నమ్మబలికాడు. అయితే వీసా, పాస్‌పోర్టుల నిమిత్తం రూ.15 లక్షలు అవుతాయని చెప్పారు. దీంతో ఈ ఏడాది జనవరిలో ఓ బ్యాంక్‌లో ఇంటి పత్రాలను తనఖా పెట్టించి రూ.14 లక్షల రుణం ఇప్పించారు. జనవరి 9న వీసా, పాస్‌పోర్టులు యిప్పిస్తానని దఫాల వారీగా రూ.11.80 లక్షలు బ్యాంక్ ఖాతాలోకి జమ చేయించుకున్నారు. ఇప్పటి వరకు వీసా ఇప్పించ లేదు. డబ్బుల డిగితే సరైన సమాధానం లేదు. ఇటీవల ఇంటి వద్దకొచ్చి దాడికి యత్నించారు. డబ్బులు చెల్లించకపోగా చంపుతామని బెదిరిస్తున్నారు. న్యాయం చేయగలరు.

– షేక్ ఇమ్రాన్, బారాఇమామ్‌పంజా, పాతగుంటూరు

ఫుడ్ కార్పొరేషన్‌లో ఉద్యోగాలని..

సుమారు ఐదేళ్ల క్రితం తెలిసిన వారి ద్వారా సంగడిగుంటకు చెందిన ఇద్దరు, బాపట్ల జిల్లా కర్లపాలెంకు చెందిన మరో వ్యక్తి పరిచయమయ్యారు. ఫుడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా, లక్నోలో ఉద్యోగాలు ఇప్పిస్తామని నమ్మబలికారు. (ఈ క్రమంలో వారికి దఫాల వారీగా సుమారు రూ.12 లక్షలు చెల్లించినట్లు పల్నాడు జిల్లా వెల్దుర్తి రచ్చమల్లపాడు గ్రామ వాసి పులగం మణికంఠరెడ్డి తెలిపారు. వారి వద్ద నుంచి రూ.6.02 లక్షలు రావాల్సి ఉందని పాతగుంటూరు వాసి ఎ.హరీష్ చెప్పారు.) అయితే ఉద్యోగాల పేర్లతో ఉత్తరప్రదేశ్ కాన్పూర్‌లో ప్రభుత్వ వైద్యశాలలో వైద్యపరీక్షలు చేయించారు. నకిలీ ధ్రువీకరణ పత్రాలు, నకిలీ ఉద్యోగ నియమాక పత్రాలు అందించారు. అంతేగాక 2020లో ఉద్యోగాల్లో చేరాలని ఫతేపూర్ సిటీకి పిలిపించారు. ఎవరో మోసగించారని అక్కడి అధికార, సిబ్బంది తెలిపారు. దీంతో అనేక మార్లు వారిని డబ్బులు ఇవ్వాలని అడిగినా ప్రయోజనంలేదు. వారిపై పాతగుంటూరు పీఎస్, బాపట్ల డీపీఓలోని ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఫిర్యాదులు చేసిన పట్టించుకోలేదు.

– పులగం మణికంఠరెడ్డి, వెల్దుర్తి, ఎ.హరీష్, పాతగుంటూరు

ఓపీ కష్టాలకు ఇక చెల్లు చీటీ!



ప్రారంభానికి సిద్ధమైన నూతన ఓపీ కౌంటర్లు



డాక్టర్ యశశ్వి రమణ

జీజీహెచ్‌లో అదనంగా ఏడు ఓపీ కౌంటర్లు సిద్ధం

గుంటూరు మెడికల్: గుంటూరు జీజీహెచ్‌లో చికిత్స కోసం వచ్చే రోగులు తప్పనిసరిగా మొదటగా అవుట్ పేషెంట్ విభాగంలో ఓపీ చీటి తీసుకోవాల్సి ఉంటుంది. ప్రతిరోజూ జీజీహెచ్‌కు ఏడు జిల్లాల నుంచి సుమారు 2,500 మంది రోగులు ఓపీ విభాగానికి వస్తుంటారు. ఓపీ చీటీ తీసుకోవడానికి రోగులకు గంటకుపైగా సమయం పడుతోంది. ప్రస్తుతం ఆసుపత్రిలో పది ఓపీ కౌంటర్లు ఉన్నాయి. అదనంగా కౌంటర్లు ఏర్పాటు చేయడం ద్వారా ఓపీ చీటీలు త్వరితగతిన రోగులకు అందించే వీలు కలుగుతోంది. ఆసుపత్రి సూపరింటెండెంట్‌గా గతనెలలో బాధ్యతలు చేపట్టిన డాక్టర్ యశశ్వి రమణ తొలుత ఆసుపత్రిలో వాహనాల పార్కింగ్, ట్రాఫిక్ సమస్యపై దృష్టి సారించి కొంత మేరకు సమస్యను పరిష్కరించారు. అనంతరం ఓపీ కౌంటర్ల వద్ద రద్దీగా ఉండటాన్ని గమనించి అదనంగా ఓపీ కౌంటర్లు ఏర్పాటు చేసేందుకు రంగం సిద్ధం చేశారు. ఏడు ఓపీ కౌంటర్లను నూతనంగా నిర్మించారు. త్వరలోనే ఓపీ కౌంటర్లు ప్రారంభిస్తామని ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ యశశ్వి రమణ తెలిపారు. ఓపీ కౌంటర్లలో చీటీలు రోగులకు త్వరగా అందేలా చేయడంతోపాటుగా, సాహో జీజీహెచ్ కార్యక్రమంలో భాగంగా పలువురు వలంటీర్లను సైతం జీజీహెచ్‌లో అందుబాటులోకి తీసుకొస్తున్నామన్నారు. రోగులు ఓపీ చీటి తీసుకున్న తరువాత ఓపీకి ఎక్కడికి వెళ్లాలి, ఏవిధంగా వెళ్లాలి, ల్యాబ్‌లు, స్కానింగ్ కేంద్రాలు ఇతర వైద్య పరీక్షలు ఎక్కడా చేస్తారనే విషయాలను రోగులకు దగ్గరుండి సాయం చేసేందుకు వలంటీర్లు తమవంతు కృషి చేస్తారని వెల్లడించారు. పలు స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు వలంటీర్లుగా పనిచేసేందుకు ముందుకు వచ్చారన్నారు. ఓపీ కౌంటర్లలో రోగుల సహాయకులు వేచి యుండేందుకు సైతం దాతల సహాయంతో బల్లలు ఏర్పాటు చేయడంతోపాటు, ప్రత్యేకంగా వెయిటింగ్ హాలును నిర్మిస్తున్నట్లు వెల్లడించారు. కేంద్ర మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్, గుంటూరు తూర్పు ఎమ్మెల్యే, జీజీహెచ్ హెచ్‌డీఎస్ కో కన్వీనర్ నసీర్ అహ్మద్, జిల్లా కలెక్టర్, హెచ్‌డీఎస్ చైర్మన్ నాగలక్ష్మి, ఇతర ప్రజాప్రతినిధులు, అధికారులు సహాయ సహకారాలతో జీజీహెచ్‌లో పేద రోగులకు కార్పొరేట్ వైద్య సేవలు ఉచితంగా అందించడమే లక్ష్యంగా పని చేస్తున్నట్లు తెలిపారు.

వైభవంగా వీవీఐటీ వార్షికోత్సవం



ప్రతిభ చూపిన విద్యార్థినులకు షీల్డ్ అందజేస్తున్న వీవీఐటీ చైర్మన్ వాసిరెడ్డి విద్యాసాగర్



విద్యార్థులకు షీల్డ్ అందజేస్తున్న వీవీఐటీ చైర్మన్ వాసిరెడ్డి విద్యాసాగర్

పెదకాకాని: వీవీఐటీలో సంపూర్ణ క్రమశిక్షణతో కూడిన విద్యనందిస్తున్నట్లు కళాశాల చైర్మన్ వాసిరెడ్డి విద్యాసాగర్ అన్నారు. మండలంలోని నంబూరు వాసిరెడ్డి వెంకటాద్రి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ కళాశాల 17వ వార్షికోత్సవం సోమవారం వైభవంగా నిర్వహించారు. వార్షికోత్సవంలో భాగంగా నిర్వహించిన పూర్వ విద్యార్థుల సమ్మేళనం మనసులను హత్తుకుంది. చైర్మన్ వాసిరెడ్డి విద్యాసాగర్ మాట్లాడుతూ సంపూర్ణ క్రమశిక్షణ, సంపూర్ణ విద్య నినాదంతో విలువలతో కూడిన విద్యను అందిస్తున్నామన్నారు. కళాశాల విద్యార్థులు అన్నిరంగాలలో రాణించి విజేతలుగా ఎదగడం సంతోషం కలిగించినదన్నారు. నూతనంగా ఏర్పాటు చేసిన పూర్వ విద్యార్థుల సంఘం ద్వారా ప్రస్తుత విద్యార్థుల భవిష్యత్ ప్రణాళికలకు సహాయ సహకారాలు అందిస్తామన్నారు. అనంతరం చైర్మన్ వాసిరెడ్డి విద్యాసాగర్, వైస్ చైర్మన్ వాసిరెడ్డి మహదేవ్, ప్రిన్సిపాల్ డాక్టర్ వై.మల్లిఖార్జునరెడ్డి 2023–24 విద్యా సంవత్సరంలో అత్యుత్తమ ప్రదర్శన కనబరచిన విద్యార్థులకు ప్రశంసాపత్రాలు, మెడల్స్‌ను అందచేశారు. ఈవిద్యాసంవత్సరంలో మెరుగైన ఉత్తీర్ణతా శాతాన్ని సాధించిన విభాగంగా కంప్యూటర్ సైన్స్ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ అండ్ మిషన్ లెర్నింగ్(సీఎస్ఎం), అకడమిక్స్ టాపర్‌గా విద్యాయేతర (క్రీడ, సాంస్కృతిక) అంశాల్లో ఉత్తమ ప్రదర్శన కనబరిచిన విభాగం కంప్యూటర్ సైన్స్– ఐఓటీ అండ్ సైబర్ సెక్యూరిటీ విత్ బ్లాక్‌చైన్ టెక్నాలజీ (సిఐసి) రోలింగ్ షీల్డ్‌లను దక్కించుకున్నాయి.

ప్రతి పైసాకు బాధ్యత వహించాలి

నీటియాజమాన్య సంస్థ పల్నాడు జిల్లా పీడీ ఎం.సిద్ధలింగమూర్తి

రెంటచింతల: గ్రామాలలో చేపట్టిన వివిధ ప్రభుత్వ పథకాలకు సంబంధించి క్షేత్రస్థాయి సిబ్బంది ప్రతి పైసాకు బాధ్యత వహించాల్సింటుందని జిల్లా ప్రాజెక్టు డైరెక్టర్ జిల్లా నీటియాజమాన్య సంస్థ ఎం.సిద్ధలింగమూర్తి అన్నారు. సోమవారం స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయం వద్ద 16వ విడతకు సంబంధించి నిర్వహించిన సామాజిక తనిఖీ– ప్రజా వేదికకు ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. 2023–24 ఆర్థిక సంవత్సరంలో గ్రామాలలో చేసిన ఉపాధి హామీ పథకం పనులు, పంచాయిరాజ్ శాఖ, హౌసింగ్ అంశాలపై గ్రామాలలో ఈ నెల 16 నుంచి 22 వరకు క్షేత్రస్థాయిలో సామాజిక తనిఖీ నిర్వహించినట్లు తెలిపారు. తనిఖీలలో మండలంలోని 11 గ్రామాలకు సంబంధించి మొత్తం రూ. 1,07,824 రికవరీ చేయడానికి చర్యలు చేపట్టినట్లు తెలిపారు. జిల్లా విజిలెన్స్ అధికారి విజయకుమారి, ఎంపీడీఓ కె.సరోజినిదేవి, ఎస్ఆర్పీ జేఎస్ రాజు, ఏపీఓ జయచంద్ర కుమార్, సర్పంచ్ గొట్టం ప్రమీల గురవారెడ్డి, కార్యదర్శులు, ఉపాధి, ఉపాధి కూలీలు తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అవగాహన అవసరం

జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్



మాట్లాడుతున్న జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్

నగరంపాలెం: ప్రస్తుత రోజుల్లో సైబర్ నేరాల బారినపడి అనేక మంది నష్టపోతున్నారని జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్ అన్నారు. జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో మార్కెట్ కూడలిలోని శ్రీవెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో సోమవారం సైబర్ వేలార్ –2024, సైబర్ నేరాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ అన్ని వయసుల వారిని, వృత్తులతో సంబంధం లేకుండా సైబర్ నేరగాళ్లు మోసగిస్తున్నారని చెప్పారు. వారి కష్టార్జితాన్ని సెకన్లల్లో కాజేస్తూనే ఉన్నారని పేర్కొన్నారు. సైబర్ మోసాల పట్ల అవగాహన కలిగి ఉండాలని అన్నారు. తద్వారా మోసాల బారినపడే అవకాశం ఉండదన్నారు. సైబర్ మోసాలపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు సైబర్ వేలార్, సైబర్ సెక్యూరిటీ మేళా – 2024 పేరుతో అవగాహన సదస్సు ఏర్పాటు చేశామన్నారు. ప్రజలు ఎప్పుడైనా సైబర్ నేరానికి లేదా మోసానికి గురైతే వెంటనే 1930 అనే జాతీయ సైబర్ భద్రత సెల్ టోల్ ఫ్రీ నంబర్‌లో సంప్రదించాలని అన్నారు. 1930 జాతీయ సైబర్ భద్రత సెల్ టోల్ ఫ్రీ నంబర్ కేవలం సైబర్ మోసం జరిగిన తర్వాత బాధితులకు సహాయం అందిస్తారని తెలిపారు. అదే విధంగా బ్యాంక్, పోలీస్‌స్టేషన్‌కు వెళ్తే సైబర్ నేరాలకు గురికాకుండా ఉండేందుకు అవగాహన కల్పిస్తారని చెప్పారు.

లఘు చిత్రాల విజేతలకు నగదు ప్రోత్సాహకాలు..

విద్యార్థులకు సైబర్ మోసాలు, నేరాలపై చుట్టుపక్కల వారికి అవగాహన కల్పించేందుకు ఇటీవల లఘు చిత్ర పోటీలు నిర్వహించారు. ఈ క్రమంలో మొదటి బహుమతి రూ.25 వేలు నిర్మల కాలేజ్ ఆఫ్ ఫార్మసీ, (మంగళగిరి). రెండో బహుమతి రూ.20 వేలు ఆర్‌వీఆర్ అండ్ జేసీ కళాశాల (చౌడవరం), మూడో బహుమతి రూ.15 వేలు విజ్ఞాన్ లారా ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్స్ (వడ్లమూడి), నాలుగో (ప్రోత్సాహక) బహుమతి రూ.5 వేలు అభ్యుదయ మహిళా డిగ్రీ కళాశాలకు జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్, పాటిబండ్ల ప్రసాద్ అందించారు. కార్యక్రమంలో జిల్లా ఏఎస్పీలు జీవీ.రమణమూర్తి (పరిపాలన), ఎ.హనుమంతు (ఏఆర్), డీఎస్పీలు, సీఐలు, ఎస్ఐలు, ఉపాధ్యాయులు, మహిళా పోలీస్ సిబ్బంది విద్యార్థులు పాల్గొన్నారు.

నల్లచట్టాలను దొడ్డిదారిన తేవాలనుకోవడం దుర్మార్గం

కేంద్రం తెచ్చిన నూతన బిల్లును రద్దు చేయాలని కోరుతూ రైతు సంఘాల నేతల నిరసన



వ్యవసాయ మార్కెటింగ్ నూతన బిల్లు పత్రాలను దహనం చేస్తున్న రైతు సంఘ నాయకులు

లక్ష్మీపురం: రైతాంగ పోరాట ఫలితంగా మూడు వ్యవసాయ నల్ల చట్టాలను రద్దు పరిచిన ప్రధాని నరేంద్ర మోదీ ఇదే చట్టాలను దొడ్డిదారిన వివిధ పేర్లతో మళ్లీ యావత్తు రైతాంగాన్ని దెబ్బతీసే విధంగా తీసుకురావడం చాలా దుర్మార్గమని జిల్లా రైతు సంఘం కార్యదర్శి కంచుమాటి అజయ్, రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు కొల్లి రంగారెడ్డి అన్నారు. జాతీయ అగ్రికల్చర్ మిషన్ పేరుతో వ్యవసాయ మార్కెటింగ్‌ను దెబ్బతీసే విధంగా నూతన బిల్లు కాపీని గుంటూరు కలెక్టరేట్ ముందు సోమవారం రైతు, కార్మిక, ప్రజాసంఘాలు ఆధ్వర్యంలో దహనం చేసి, నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వ్యవసాయ ఉత్పత్తులను కార్పొరేటర్ పరం చేసేందుకు 'నేషనల్ పాలసీ ఫ్రేమ్ వర్క్ ఆన్ అగ్రికల్చర్ మార్కెటింగ్' పేరుతో పెద్ద కుట్రతో నూతన చట్టాన్ని కేంద్రం తీసుకొచ్చిందన్నారు. వీటిని ఉపసంహరించుకోవాలన్నారు. అనంతరం కలెక్టర్ ఎస్.నాగలక్ష్మికి వినతి పత్రం అందించారు. ఈ కార్యక్రమంలో రైతు కూలీ సంఘం నాయకులు ఉల్లిగడ్డ నాగేశ్వరరావు, రైతు సంఘం నాయకులు పాశం రామారావు, జొన్న శివ శంకర్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి ఈమని అప్పారావు, కౌలు రైతు సంఘం జిల్లా నాయకులు జగన్నాథం, కృష్ణ, విటల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అవిశ్రాంత సాహితీ శ్రామికుడు 'పెనుగొండ'

గుర్రం జాషువా విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో ఘనసత్కారం



పెనుగొండ లక్ష్మీనారాయణను సత్కరిస్తున్న కవి పాపినేని శివశంకర్, కేఎస్ లక్ష్మణరావు, సత్యాజీ, డొక్కా, పాశం రామారావు

లక్ష్మీపురం: అవిశ్రాంత సాహితీ శ్రామికుడు పెనుగొండ లక్ష్మీనారాయణ అని, ఆయనకు కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు దక్కడం గర్వకారణమని అభ్యుదయ కవి పాపినేని శివశంకర్ అన్నారు. స్థానిక బ్రాడీపేటలోని జాషువా విజ్ఞాన కేంద్రంలో ఎమ్మెల్సీ కె.ఎస్.లక్ష్మణరావు అధ్యక్షతన గుర్రం జాషువా విజ్ఞాన కేంద్రం, సాహితీ స్రవంతి ఆధ్వర్యంలో అభినందన సభ సోమవారం జరిగింది. ఈ సందర్భంగా పాపినేని శివశంకర్ మాట్లాడుతూ పెనుగొండకు కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు దక్కడం రాష్ట్రానికి, గుంటూరు సీమకు గర్వకారణమన్నారు. గత 40 ఏళ్లుగా ఉభయ తెలుగు రాష్ట్రాలలో సాహిత్య రంగంలో అనేక పెడధోరణలు వ్యక్తమవుతూ కలుషితమవుతున్న నేపథ్యంలో అభ్యుదయ సాహిత్యానికి గుర్తింపు రావడం సంతోషించదగ్గ విషయమన్నారు. ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు మాట్లాడుతూ పెనుగొండ లక్ష్మీనారాయణ ఇటీవల రాసిన గుంటూరు సీమ సాహిత్య చరిత్ర అనే గ్రంథంలో అనేక విషయాలు వెల్లడించారన్నారు. సాహితీ స్రవంతి రాష్ట్ర ఉపాధ్యక్షుడు సత్యాజీ మాట్లాడుతూ పెనుగొండ లక్ష్మీనారాయణకు దక్కిన అవార్డు కష్టజీవులకు వచ్చిన అవార్డేనని అభ్యుదయ సాహిత్యానికి లభించిన గుర్తింపన్నారు. మాజీ మంత్రి డొక్కా మాణిక్యవరప్రసాద్ మాట్లాడుతూ నవయుగ కవి చక్రవర్తి గుర్రం జాషువా పుట్టిన గడ్డ, అనేక అభ్యుదయ, ప్రజా ఉద్యమాలకు పుట్టినిల్లుగా వున్న వినుకొండలో జన్మించడం వల్ల జాషువా ప్రభావం కూడా పెనుగొండపై ఉందన్నారు. అవార్డు గ్రహీత పెనుగొండ లక్ష్మీనారాయణ మాట్లాడుతూ అభ్యుదయ రచయితల సంఘం, ప్రజానాట్య మండలి సాంస్కృతిక పునరుజ్జీవనానికి, సాహిత్య సాంస్కృతిక రంగాలలో కమ్యూనిస్టు పార్టీ గొప్ప కృషి చేసిందని చెప్పేందుకు గర్వపడుతున్నామన్నారు. అభ్యుదయ రచయితల సంఘం మూలాలను పరిశీలిస్తే పేదల సమస్యల పరిష్కారం, అభ్యుదయ భావజాలాన్ని విస్తృతంగా ప్రజల్లోకి తీసుకువెళ్లడమేనని, తనకు దక్కిన పురస్కారం సమాజానికి దక్కడమేనన్నారు. గుర్రం జాషువా విజ్ఞాన కేంద్రం మేనేజింగ్ ట్రస్టీ పాశం రామారావు మాట్లాడారు. విజ్ఞాన కేంద్రం కార్యదర్శి ఎంకాళిదాసు, విప్లవ రచయితల సంఘం నాయకుడు సి.యస్.ఆర్. ప్రసాద్, కవులు, కళాకారులు పాల్గొన్నారు.

హెల్మెట్ లేకుంటే యమ డేంజర్!

హెల్మెట్ ధారణపై యముడి వేషధారణలో వినూత్న ప్రచారం



హెల్మెట్ ధారణపై అవగాహన కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న ఎస్పీ సతీష్‌కుమార్

పట్నంబజారు: హెల్మెట్ అనేది ప్రతి ఒక్కరికీ ప్రాణాపాయ పరిస్థితుల్లో రక్షణ కవచం వంటిదని గుంటూరు జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్ చెప్పారు. సోమవారం ఈస్ట్ ట్రాఫిక్ పోలీసు స్టేషన్ పరిధిలోని ట్రాఫిక్ సీఐ ఎ.అశోక్‌కుమార్ ఆధ్వర్యంలో హిందూ కళాశాల కూడలి ప్రాంతంలో హెల్మెట్‌పై స్పెషల్ డ్రైవ్ జరిగింది. దానిలో భాగంగా యమధర్మరాజు వేషధారణలో వ్యక్తి హెల్మెట్ ధరించకపోవడం వల్ల జరిగే అనర్థాలను వివరించారు. వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టిన నేపథ్యంలో జిల్లా సతీష్‌కుమార్ స్వయంగా హాజరై అవగాహన కార్యక్రమాన్ని పరిశీలించారు. ఎస్పీ సతీష్‌కుమార్ మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాలు జరిగిన సమయంలో అధికంగా తలభాగానికి గాయాలు అవడం వల్లే మృత్యువాత పడుతున్నారని తెలిపారు. హెల్మెట్ ధరించకుండా వాహనాలు నడిపితే యమధర్మరాజు మీ వెంటనే ఉంటాడన్న సందేశాన్ని తెలియజేసేలా ఆసక్తికరంగా అవగాహన కార్యక్రమం నిర్వహించడం అభినందనీయమన్నారు. ఏఎస్పీ ఎ.హనుమంత్, ట్రాఫిక్ పోలీసులు పాల్గొన్నారు.

సేంద్రియ ఆహారంతోనే ఆరోగ్యం



పురస్కార గ్రహీతలతో డీజీపీ ద్వారకా తిరుమలరావు, ఏపీ వ్యవసాయశాఖ డైరెక్టర్ ఢిల్లీరావు తదితరులు

- డీజీపీ సీహెచ్ ద్వారకా తిరుమలరావు
- రైతునేస్తం ఫౌండేషన్ మిద్దెతోటల పురస్కారాలు ప్రదానం

గుంటూరు రూరల్: సేంద్రియ ఆహారంతోనే ఆరోగ్యంగా జీవించవచ్చని ఆంధ్రప్రదేశ్ డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ సీహెచ్ ద్వారకా తిరుమలరావు తెలిపారు. సోమవారం వట్టిచెరుకూరు మండలం పుల్లడిగుంట నందున్న రైతునేస్తం ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన తుమ్మేటి రఘోత్తమరెడ్డి రైతునేస్తం మిద్దెతోటల పురస్కారాలు–2024 కార్యక్రమంలో డీజీపీ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రైతునేస్తం ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో పాల్గొనటం సంతోషకరమన్నారు. ఇంట్లో మొక్కలు పెంచుకునే వారికి ప్రభుత్వం తరఫు నుంచి ప్రోత్సాహకాన్ని అందించడానికి తన వంతు కృషి చేస్తానని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వ్యవసాయ శాఖ డైరెక్టర్ ఎస్.ఢిల్లీరావు తెలిపారు. పురస్కారాలు అందుకున్న వారందరికీ అభినందనలు తెలియజేశారు. కార్యక్రమంలో ప్రముఖ మిద్దెతోట నిపుణులు తుమ్మేటి రఘోత్తమరెడ్డి, రైతునేస్తం ఫౌండేషన్ చైర్మన్ వై.వేంకటేశ్వరరావు రైతులు, తదితరులు పాల్గొన్నారు.